E-KABURU E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
(తేదీ) 27-04-2025 (వారం) ఆదివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు »2లో



## అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు : రేవంత్ రెడ్డి

- రైతులకు అండగా – భారీ రుణమాఫీ, భరోసా పథకాలు
- నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు, స్కిల్ యూనివర్సిటీలు
- మహిళా సాధికారతకు కంకణం కోటీశ్వరి లక్ష్యం
- ప్రజల సంక్షేమం కోసం మల్టీ డైమెన్షనల్ పథకాలు
- తెలంగాణను గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దే ఫ్యూచర్ సిటీ దిశగా

తరువాయి 2లో

సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి: రాహుల్



- పాత రాజకీయ సంస్కృతికి ముగింపు
- యువతకు రాహుల్ గాంధీ పిలుపు
- ప్రజాస్వామ్యంలో మార్పు అవసరం
- నూతన దిశగా కాంగ్రెస్ దృష్టి
- పాదయాత్ర ద్వారా ప్రజలతో అనుబంధం బలపడింది
- విపక్ష గొంతుకలకు అవకాశం లేకపోవడం ప్రమాదకరం
- "విద్వేశాల బజారులో ప్రేమ దుకాణం" మానవతా మార్గంలో కాంగ్రెస్

»2లో

## బీఆర్ఎస్ సభకు సర్వం సిద్ధం.. 500 మంది కూర్చునేలా మెయిన్ స్టేజ్



»2లో

## టెన్షన్ పడకండి.. అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే - హరీష్ రావు




»2లో

## తెలంగాణలోఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్



»2లో

## కేసీఆర్ సర్కార్ నాసిరకం పనులతో కాళేశ్వరం నాశనం: ఉత్తమ్ కుమార్ రెడ్డి



కాళేశ్వరం పరిస్థితి ఏంటో ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్‌లో తేలింది: మంత్రి ఉత్తమ్
ప్రజల ఎదుట బీఆర్ఎస్ దోషిగా నిర్ధారణ అయ్యింది
ప్రాజెక్టును రైతుల కోసం కట్టలే.. వారి జేబులు నింపుకునేందుకు కట్టిన్రు
బాధ్యులకు శిక్షలు తప్పవు.. ఏ ఒక్కరినీ ఉపేక్షించం
రిపోర్ట్‌పై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడి

»2లో

## తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా?: మంత్రి కోమటిరెడ్డి



»2లో



## పోప్ ఫ్రాన్సిస్‌కు వీడ్కోలు.. ముగిసిన అంత్యక్రియలు

**పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ముగిశాయి. వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా 50కిపైగా దేశాధినేతలు పాల్గొన్నారు.**

ఈ కబురు : పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు ముగిశాయి. పోప్‌కు ఇష్టమైన రోమ్‌లోని సెయింట్ మేరీ మేజర్ బసిలికా లో ఖననం చేసినట్లు వాటికన్ వర్గాలు వెల్లడించాయి. అనంతరం ఆయన సమాధి వద్ద కార్డినల్స్ ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపాయి. అయితే, చర్చిలో అంత్యక్రియలు ప్రైవేటుగా నిర్వహించారు. కేవలం ఉన్నతస్థాయి కార్డినల్స్, పోప్ సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు. అంతకుముందు వాటికన్ సిటీలోని సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సహా 50కిపైగా దేశాధినేతలు, వివిధ దేశాల నుంచి వచ్చిన ప్రముఖులు క్యాథలిక్కుల అత్యున్నత గురువుకు నివాళులు అర్పించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్, బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తదితరులు ఈ కార్యక్రమానికి హాజరై పోప్‌కు తుది వీడ్కోలు పలికారు. వీరితోపాటు దాదాపు లక్షన్నర మంది సాధారణ పౌరులు పోప్ అంత్యక్రియలను వీక్షించేందుకు వచ్చినట్లు అంచనా. శాంటామారియా చర్చికి ఊరేగింపుగా తీసుకెళ్లే సమయంలోనూ రోమ్ వీధుల్లో లక్షలాది మంది బారులు తీరారు.

తదుపరి పోప్ ఎవరు?.. రహస్యంగా ఎన్నుకోనున్న కార్డినళ్లు

పోప్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 21న తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. అంతకు ఒకరోజు ముందే ఈస్టర్ నాడు ప్రజలకు సందేశం ఇచ్చిన పోప్.. జీవితసారాన్ని ప్రపంచానికి గుర్తుచేశారు. శాంతి పునరుద్ధరణ కోసం కృషి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. 1936 డిసెంబర్ 17న అర్జెంటీనాలో జన్మించిన పోప్ ఫ్రాన్సిస్.. 2013 మార్చి 13న 266వ పోప్‌గా ఎన్నికయ్యారు. లాటిన్ అమెరికా నుంచి పోప్‌గా ఎన్నికైన మొట్ట మొదటి వ్యక్తిగా ఆయన ఖ్యాతి గడించారు.

## అంతా భారత్ ఇష్టమేనా?.. దేనికైనా రెడీ.. పాక్ ప్రధాని సంచలన వ్యాఖ్యలు



ఇస్లామాబాద్: భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ పాక్ ప్రధాని షెహబాబ్ షరీఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పాకిస్తాన్ ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు అంటూ కామెంట్స్ చేశారు.

జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌పై భారత్ పలు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ పౌరులు భారత్‌ను విడిచి వెళ్లిపోవాలని, నదుల విషయంలో కూడా నీటిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేసింది. ఈ పరిణామాలపై పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ స్పందించారు. ఈ సందర్భంగా ఉగ్రవాదాన్ని సమూలంగా నాశనం చేస్తామంటూ ఇటీవల భారత ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై షరీఫ్ పరోక్షంగా స్పందించారు.

ఖైబర్ పఖ్తుంఖ్వాలోని పాకిస్తాన్ మిలిటరీ అకాడమీ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో పాక్ ప్రధాని షరీఫ్ మాట్లాడుతూ..'మా దేశ భద్రత, సార్వభౌమత్వంపై ఎన్నటికీ రాజీపడబోం. ఎలాంటి ముప్పును ఎదుర్కోడానికైనా సంసిద్ధంగా ఉన్నాం. పహల్గాంలో ఇటీవల జరిగిన విషాదకర ఘటనతో మరోసారి మన దేశం నిందలు ఎదుర్కొంటోంది. ఆ ఘటనపై తటస్థ, పారదర్శక, విశ్వసనీయ దర్యాప్తులో పాల్గొనేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. శాంతికే మా ప్రాధాన్యం. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత అంశం కరెక్ట్ కాదు. భారత్ ఇలా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం తగదు. ఈ చర్యతో యుద్ధ వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని మేం కోరుకుంటున్నాం' అంటూ భారత్‌ను నిందించే ప్రయత్నం చేశారు. చివరగా.. ఉగ్రవాదాన్ని తాము కూడా ఖండిస్తామంటూ చెప్పుకొచ్చారు. పహల్గాం దాడి పై తటస్థ దర్యాప్తునకు తాము సిద్ధమేనని ప్రకటించారు.

## ఇరాన్ నౌకాశ్రయంలో భారీ పేలుడు.. 700 మందికిపైగా గాయాలు

»2లో

# అభివృద్ధి దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం అడుగులు : రేవంత్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు : దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చాం: భారత్ సమ్మిట్లో సీఎం రేవంత్ రెడ్డి
హైదరాబాద్: తెలంగాణలో పెట్టుబడులను ఆహ్వానించామని, దావోస్ నుంచి లక్ష కోట్ల పెట్టుబడులు తెచ్చామని, మహిళలను కోటీశ్వరులను చేయడమే అజెండాగా పెట్టుకున్నామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని హెచ్ఐ సీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్లో సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. ప్రజలు తమ ప్రభుత్వంపై చాలా ఆశలు పెట్టుకున్నారని, సమాజంలో అన్ని వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకెళుతుందని సీఎం చెప్పారు సమాజంలోని అన్ని వర్గాల ఆకాంక్షలు నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దీనికోసం అనేక పథకాలను తీసుకొచ్చామన్నారు. దేశంలోనే అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, ఇప్పటికే రూ.20 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో పాల్గొని ఆయన మాట్లాడారు. 'రైతు భరోసా కింద ఎకరాకు రూ.12 వేలు ఇస్తున్నాం. వరికి మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్ ఇస్తున్నాం. పట్టభద్రులు సర్టిఫికెట్ తీసుకుంటున్నారు. కానీ ఉద్యోగాలు లేవు. యువత కోసం రాజీవ్ యువ వికాసం పథకం తీసుకొచ్చాం. ప్రజలకు ఏ సమయంలో ఏది అవసరమో కాంగ్రెస్‌కు బాగా తెలుసు'' రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సమ్మిట్‌కు పలువురు మంత్రులు, కాంగ్రెస్ నేతల, విదేశీ ప్రతినిధులు హాజయ్యారు. వివిధ అంశాలపై చర్చలు కొనసాగుతున్నాయి. బహుళత్వం వైవిధ్యం, పోలరైజేషన్‌ను అధిగమించడం, వేగవంతమైన న్యాయం, అనిశ్చితికాలంలో ఆర్థిక న్యాయం, ప్రపంచ శాంతి, న్యాయంపై చర్చలు జరుగుతున్నాయి దేశంలో అతిపెద్ద రైతు రుణమాఫీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని, రైతులకు సుమారు రూ.20 వేల కోట్ల రుణమాఫీ చేశామని సీఎం రేవంత్ గుర్తుచేశారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.12 వేలు ఇస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. నిరుద్యోగులకు 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించామని, యువత కోసం యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ సీఎం రేవంత్ రెడ్డి భారత్ సమ్మిట్లో ప్రస్తావించారు. దక్షిణ కొరియా, దావోస్లో పర్యటించి పెట్టుబడులను ఆకర్షించామని, రాజీవ్ యువ వికాసం కార్యక్రమంతో యువతకు ఉపాధి కల్పించబోతున్నామని సీఎం రేవంత్ వివరించారు. పారిశ్రామికవేత్తలతో పోటీ పడేలా తెలంగాణ మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకాలు కల్పిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. రాష్ట్రంలో ఫ్యూచర్ సిటీని నిర్మించబోతున్నామని, దేశానికే రోల్ మోడల్గా నిలిచే కులగణన చేపట్టామని సీఎం తెలిపారు.

## భారత్ సమ్మిట్లో సీఎం రేవంత్ స్పీచ్ హైలైట్స్:

* పదేండ్లలో తెలంగాణ ప్రజల కల నెరవేరలేదు
* ప్రజల ఇష్టం ప్రకారం మా ప్రభుత్వం నడుస్తోంది
* రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేశాం
* ఇది ఇండియాలో అతిపెద్ద రుణమాఫీ
* రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం
* సాగుకు యోగ్యమైన ప్రతి ఎకరాకు రైతు భరోసా ఇస్తున్నాం
* పంటలకు గిట్టుబాటు ధర ఇస్తున్నాం
* సన్నవడ్లకు బోనస్ కూడా ఇస్తున్నాం
* పదేండ్లల్లో నిరుద్యోగులను బీఆర్ఎస్ మోసం చేసింది
* మేము వచ్చాక ఏడాదిలోనే 57 వేల ఉద్యోగాలిచ్చాం
* ఇటీవల పెట్టుబడులతో 2 లక్షల ఉద్యోగాలు సాధించాం
* సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను బలోపేతం చేస్తున్నాం
* కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయబోతున్నాం
* మొదటి ఏడాదిలో రూ.22 వేల కోట్ల ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చాం
* ఫ్రీ బస్సు స్కీంకు రూ.500 వేల కోట్లు ఖర్చు చేశాం
* రాజీవ్ ఆరోగ్య శ్రీ మా పథకాల్లో మరో అద్భుతమైన పథకం
* పేదలకు కార్పొరేట్ వైద్యం కోసం రూ.10 లక్షలు ఇస్తున్నాం
* అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మిస్తున్నాం
* రాష్ట్రంలో ప్రతి ఒక్కరి సమస్య వింటున్నాం
* దీని కోసం ప్రజావాణిని నిర్వహిస్తున్నాం
* మేము ఇటీవలే ఎస్సీ వర్గీకరణ చేశాం
* థర్డ్ జెండర్ను పోలీస్ శాఖలో రిక్రూట్ చేసుకున్నాం
* తలసరి ఆదాయంలో మేము టాప్లో ఉన్నాం

# యువత రాజకీయాల్లోకి రావాలి: రాహుల్




మొదటి పేజీ తరువాయి

ఈ కబురు :పాతతరం ముగిసింది..యువత రాజకీయాల్లోకి రావాలి: రాహుల్ గాంధీ
పాతతరం రాజకీయం అంతరించిపోయింది. ఇప్పుడంతా యంగ్ అండ్ న్యూ పాలిటిక్స్ నడుస్తున్నాయి..యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. శనివారం (ఏప్రిల్ 26) నోవాటెల్ లో జరుగుతున్న భారత్ సమ్మిట్ లో పాల్గొన్న రాహుల్ గాంధీ దేశ రాజకీయాలు, ప్రజాస్వామ్యం, దేశం, ప్రజల పట్ల కాంగ్రెస్ పార్టీకున్న ప్రేమ, ప్రజలకు ఏం చేయాలని పార్టీ అనుకుంటుందో వివరించారు.
ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజాస్వామ్య రాజకీయాల్లో చాలా మార్పులొచ్చాయి. గడిచిన పదేళ్లలో దేశంలో ఏం జరిగిందో అందరికీ తెలుసు.. ప్రభుత్వ పాలసీలపై లోతుగా చర్చించాల్సి ఉందన్నారు. చట్టసభల్లో విపక్షాలకు మాట్లాడే అవకాశం కూడా రావడం లేదన్నారు. విపక్షాలు తమ గొంతు వినిపించేందుకు కొత్త వేదికలు వెతుక్కోవాల్సి వస్తుందన్నారు రాహుల్ గాంధీ.
పాతతరం రాజకీయం అంతరించి పోయింది. ఇప్పుడంతా యంగ్ అండ్ న్యూ పాలిటిక్స్ నడుస్తున్నాయి. రాజకీయాల్లోకి కొత్త తరం(యువత ) రావాల్సిన అవసరం ఉందన్నారు రాహుల్ గాంధీ. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్ల పాదయాత్ర చేపట్టారు. పాదయాత్ర మొదట్లో నాతో కొద్ది మంది మాత్రమే ఉన్నారు.. రోజులు గడుస్తున్న కొద్దీ నాతో వేలాది మంది నడిచారన్నారు. ప్రజలతో కమ్యూనికేట్ అయ్యేందుకు ప్రయత్నించాను సక్సెస్ అయ్యాను అన్నారు. మేం దేశ ప్రజలకు ప్రేమను పంచేందుకు పాదయాత్రను మొదలు పెట్టాం.. ''విద్వేశాల బజారులో ప్రేమ దుకాణం తెరిచామన్నారు'' రాహుల్ గాంధీ.

దేశంలో మహిళలు ఎన్నో కష్టాలు ఎదుర్కొంటున్నారు.. ఇప్పుడు సమస్యల పరిష్కారానికి ప్రజలే మార్గం చూపిస్తున్నారు అని రాహుల్ గాంధీ అన్నారు. రాజకీయాలు కూడా ప్రజల ఇష్టానుసారంగానే ఉండాలన్నారు.

# కేసీఆర్ సర్కార్ నాసిరకం పనులతో కాళేశ్వరం నాశనం: ఉత్తమ్ కుమార్ రెడ్డి

మొదటి పేజీ తరువాయి

ఈ కబురు ,హైదరాబాద్, : కాళేశ్వరం ప్రాజెక్టు రైతుల కోసం నిర్మించింది కాదని.. నాటి అధికార పార్టీ నేతలు జేబులు నింపుకోవడానికే కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. జేబులు నింపుకున్నా.. నిర్మాణం సరిగ్గా చేపట్టలేద్నారు. కట్టినవాళ్ల టైంలోనే కూలిందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ అంశంలో ఏ ఒక్కరినీ ఉపేక్షించేది లేదని, బాధ్యులైన వారికి శిక్షలు తప్పవని ఆయన హెచ్చరించారు. శుక్రవారం హెచ్ఐసీసీలో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. ఎన్డీఎస్ ఏ రిపోర్ట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టు రూపకల్పన, నిర్వహణ లోపాలు బయటపడ్డాయని మంత్రి తెలిపారు. ప్రతి స్టేజ్‌లోనూ పూర్ కన్‌స్ట్రక్షన్ ఉందని రిపోర్ట్‌లో స్పష్టమైందన్నారు. బీఆర్ఎస్ నేతలు తెలంగాణ రైతాంగానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నిరుపయోగంగా మారినా రాష్ట్రంలో ధాన్యం దిగుబడి రికార్డు సృష్టించిందని చెప్పారు.
సీఆర్ సర్కార్ నాసిరకం పనులతో కాళేశ్వరం ప్రాజెక్టులను నాశనం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు ప్రమాదం ఉందని ఎన్డీఎస్ఏ రిపోర్టు చెప్పిందని అన్నారు. ఇవాళ హైదరాబాద్ ఎచ్ఐసీసీ భారత్ సమ్మిట్ ఆవరణంలో మీడియాతో మాట్లాడిన ఆయన.. ఇలా రూ. లక్షల కోట్లు వృథా చేస్తే ఇతర దేశాల్లో కఠిన శిక్షలు పడేవన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా ఉన్నా కూడా రాష్ట్రంలో అత్యధిక పంట పండిందని, యాసంగిలో 127 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని చెప్పారు.
అక్రమ ఆస్తుల కేసులో కాళేశ్వరం గజ్వేల్ ఈఎన్సీ అరెస్ట్..కళ్లు చెదిరేలా ఆస్తుల చిట్టా
బీఆర్ఎస్ పదేళ్లలో చేయనిది చేసి చూపాం:
రాష్ట్రంలోని ప్రాజెక్టులకు అనుమతుల విషంలో ఏడాదిన్నరగా మేం చేసిన కృషి ఫలించిందని ఉత్తమ్ అన్నారు. సీతారామసాగర్, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతి ఇచ్చిందని తెలంగాణకు ఇది పెద్ద ముందడుగు అని తెలిపారు. దశాబ్దకాలంగా బీఆర్ఎస్ సాధించలేనిది మేము ఏడాదిన్నరలోనే సాధించామన్నారు. ఈ రెండు ప్రాజెక్టులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు ఉపయోగకరం అవుతాయన్నారు. పోలవరం బ్యాక్ వాటర్ తో జరిగే నష్టాన్ని భర్తీ చేసేందుకు అవసరమైన పరిహారం, ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.
రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ క్షమాపణ చెప్పాలి..
కాళేశ్వరం ప్రాజెక్ట్ బీఆర్ఎస్ సొంత జాగీర్ కాదని.. ప్రజాధనంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే చూస్తూ సహించేది లేదని మంత్రి ఉత్తమ్ హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికతో ప్రజల ఎదుట బీఆర్ఎస్ దోషిగా నిర్ధారణ అయ్యిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన కాళేశ్వరం నిర్మాణం అంశంపై అత్యున్నత నాణ్యతా ప్రమాణాలు పాటించే జాతీయ ప్రాజెక్టుల భద్రతా సంస్థ వెలువరించిన నివేదికే ఇందుకు అద్దం పడుతున్నదన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎందుకూ పనికిరాకుండా పోయినా ఆ నిర్మాణాలు తమ గొప్పతనమని బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఆయన మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి గత ప్రభుత్వం అధిక వడ్డీలతో లక్ష కోట్లు రుణం తీసుకొచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని ఆయన దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజలను, మన పిల్లల్ని వాళ్ల పిల్లల్ని తాకట్టు పెట్టి లక్ష కోట్ల ఖరీదైన అప్పు తీసుకొచ్చి కట్టారని.. అయినా వారి హయాంలోనే కూలిపోయిందన్నారు. సిగ్గుపడి.. రాష్ట్ర ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని ఉత్తమ్ డిమాండ్ చేశారు. ఇంత జరిగాక కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికపై సమగ్రమైన అధ్యయనం చేసి తర్వాత చర్యల కోసం మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంత్రి వెల్లడించారు.



# కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు

**కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది.**

ఈ కబురు ,హైదరాబాద్: కాళేశ్వరం ఈఎన్సీ హరిరామ్ ఇంట్లో ఏసీబీ సోదాలు చేపట్టింది. హైదరాబాద్ నగరంలోని షేక్‌పేట ఆదిత్య టవర్స్‌లోని ఆయన నివాసంలో తెల్లవారుజాము నుంచి అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హరిరామ్ కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్నారు. గజ్వేల్ ప్రాంత ఈఎన్సీగా పనిచేస్తున్నారు. కాళేశ్వరం అనుమతులు, రుణాల్లో ఆయన కీలకంగా వ్యవహరించారు. హరిరామ్ భార్య అనిత నీటిపారుదల శాఖలో డిప్యూటీ ఈఎన్సీగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె వాలంతరి డైరెక్టర్ జనరల్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# తెలంగాణలోఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్



తెలంగాణలోఈ ప్రాంతాలకు వెళ్లండి.. రాహుల్‌గాంధీని ఎక్స్ వేదికగా కోరిన కేటీఆర్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు.
ఈ కబురు ,హైదరాబాద్: హైదరాబాద్ హెచ్ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్ సదస్సులో పాల్గొనేందుకు వస్తున్న కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించాలని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కోరారు. లగచర్ల గ్రామం, సుంకిశాల, ఏదైనా హైడ్రా కూల్చివేత ప్రదేశం, మూసీ కూల్చివేతల ప్రాంతం, హెచ్‌సీయూ కంచ గచ్చిబౌలిని సందర్శించాలని 'ఎక్స్' వేదికగా సూచించారు. కలుషితాహారం కారణంగా మరణించిన గురుకుల విద్యార్థుల కుటుంబాలను, ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను కలవాలన్నారు. కూలిపోయిన ఎస్ఎల్‌బీసీ టన్నెల్, ఫోర్త్ సిటీ, మొదటి ఏడాది రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన అశోక్ నగర్‌ను సందర్శించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చిన వినాశనం గురించి వినడానికి మీకు 'అద్భుతమైన' సమయం లభిస్తుందని ఆశిస్తున్నాను అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# బీఆర్ఎస్ సభకు సర్వం సిద్ధం.. 500 మంది కూర్చునేలా మెయిన్ స్టేజ్





మొదటి పేజీ తరువాయి

**బీఆర్ఎస్ రజతోత్సవం.. తెలంగాణకు గర్వకారణం బీఆర్ఎస్ రజతోత్సవం ఒక పార్టీ 25 ఏండ్ల ప్రస్థానం మాత్రమే కాదు. ఇదొక ఉద్యమ స్వప్నం.. ఒక రాష్ట్ర ఆకాంక్ష, లక్షలాది ప్రజల కలల ఫలితం.**

బీఆర్ఎస్ రజతోత్సవం ఒక పార్టీ 25 ఏండ్ల ప్రస్థానం మాత్రమే కాదు. ఇదొక ఉద్యమ స్వప్నం.. ఒక రాష్ట్ర ఆకాంక్ష, లక్షలాది ప్రజల కలల ఫలితం. తెలంగాణ తల్లి దాస్య శృంఖలాలను తెంచేందుకు బీఆర్ఎస్ చేసిన పోరు, ఉద్యమ రథసారథి కేసీఆర్ పోరాటపటిమ, తెలంగాణ కోసం ఆయన ప్రదర్శించిన తెగువ, తెలంగాణ సాధన, ఆ తర్వాత స్వరాష్ట్రాన్ని ప్రగతి పథంలో పయనింపజేసిన తీరు, ప్రజల జీవితాల్లో తెచ్చిన మార్పు తదితర అంశాల గురించి ఈ చరిత్రాత్మక సందర్భంలో విశ్లేషించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.
ఈ కబురు: తెలంగాణ ఏర్పాటును కలలో కూడా ఊహించలేని పరిస్థితుల్లో 2001 ఏప్రిల్ 27న టీఆర్ఎస్ పార్టీని కేసీఆర్ స్థాపించారు. స్వరాష్ట్ర ఏర్పాటు కలను సాకారం చేసేందుకు కేసీఆర్ కఠోర దీక్ష చేశారు. పద్నాలుగేండ్ల ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో పోరాటాలు చేశారు. ఎన్నో అడ్డంకులను ఎదుర్కొన్నారు. ఆటుపోట్లు ఎదురైనా ఉద్యమ కెరటమై ఎగిసెగిసి మీదికి దూకారే తప్ప, వెనకడుగు వేయలేదు. కేసీఆర్ దీక్షాదక్షతలు, విద్యార్థుల ఆత్మబలిదానాలు కలగలిసి 2014లో మూడున్నర కోట్ల మంది కలలను నిజం చేశారు. తెలంగాణ అవనిపై గులాబీ జెండా ఎగరడం బీఆర్ఎస్, కేసీఆర్ గెలుపు మాత్రమే కాదు, ప్రతి తెలంగాణ బిడ్డ గెలుపు. తెలంగాణ సాధన అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించింది. ప్రగతికి పట్టం కట్టింది. రైతుబంధు, రైతుబీమా, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం, మిషన్ భగీరథ లాంటి అనేక బృహత్తర పథకాలకు కేసీఆర్ అంకురార్పణ చేశారు. కేటీఆర్ కృషితో హైదరాబాద్ ప్రపంచ స్థాయి ఐటీ హబ్‌గా మారింది. విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచింది. తెలంగాణ అభివృద్ధి పథంలో నడవడంలో కేటీఆర్ పాత్ర కీలకం. ఆధునిక ఆలోచనలు, ప్రజలతో నేరుగా మమేకమవడం, ప్రజా సమస్యలను పరిష్కారం చూపడంలో పరిణతి, విశాల దృక్పథం.. అన్ని కలగలిసిన సరికొత్త రాజకీయాలకు కేటీఆర్ నాంది పలికారు. హైదరాబాద్ సహా తెలంగాణవ్యాప్తంగా మౌలిక వసతులను కల్పించి, టీఎస్ ఐపాస్ లాంటి వినూత్నమైన విధానాలను తీసుకొచ్చి అంతర్జాతీయ సంస్థలను రాష్ట్రానికి ఆకర్షించారు. ఐటీ రంగంలో భారీగా పెట్టుబడులు తీసుకొచ్చి, హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్ హబ్‌గా తీర్చిదిద్దారు. తెలంగాణ అభివృద్ధి పట్ల కమిట్‌మెంట్, తెలంగాణపై ఆయనకున్న అమితమైన ప్రేమ ఇందుకు ప్రేరణనిచ్చాయి.బీఆర్ఎస్ సౌతాఫ్రికా విభాగం తరఫున తెలంగాణ ప్రజలకు సేవ చేసుకునే అవకాశం దక్కడం నా అదృష్టం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకపోతే నాకు ఈ అవకాశం దక్కేది కాదు. ఇది పార్టీ పదవి కాదు, నన్ను నమ్మి కేసీఆర్, కేటీఆర్ నాకు అప్పగించిన బాధ్యత. నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడంతో నాకు సౌతాఫ్రికాలో ఎంతో గుర్తింపు వచ్చింది. చాలామంది ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. ఇదంతా కేసీఆర్ దయవల్లనే అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. నాకు ఈ అవకాశం ఇచ్చిన పార్టీకి, ముఖ్యంగా కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. ఈ రజతోత్సవ సభ ద్వారా గతం పట్ల గర్వంతో పాటు భవిష్యత్తుపై దృఢమైన నమ్మకంతో బీఆర్ఎస్ శ్రేణులు ముందుకుసాగాలి. ప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టి, కాంగ్రెస్ పాలనలో అగాథంలోకి పడిపోయిన తెలంగాణను దేశంలోనే

# ఇరాన్ నౌకాశ్రయంలో భారీ పేలుడు.. 700 మందికిపైగా గాయాలు

**ఇరాన్‌లోని రజేయిా నౌకాశ్రయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 700 మందికిపైగా గాయపడినట్లు స్థానిక మీడియా వెల్లడించింది.**

ఈ కబురు ,టెహ్రాన్: ఇరాన్ లో పెను ప్రమాదం చోటు చేసుకుంది. తీరప్రాంత నగరమైన బందర్ అబ్బాస్ సమీపంలోని షహీద్ రజేయిా నౌకాశ్రయంలో భారీ పేలుడు సంభవించింది. ఈ క్రమంలోనే ఘటనాస్థలంలో మంటలు చెలరేగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో ఇప్పటివరకు ఐదుగురు మృతి చెందగా.. మరో 700 మందికిపైగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలు ప్రస్తుతానికి తెలియరాలేదని చెప్పారు. అయితే, పోర్టులోని కంటెయినర్ల నుంచి పేలుడు సంభవించినట్లు భావిస్తున్నామన్నారు.
విధ్వంసక నౌకను ప్రారంభించిన కిమ్
పేలుడు అనంతరం దట్టమైన పొగలు వెలువడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. ఘటనాస్థలం నుంచి కొన్ని కిలోమీటర్ల దూరంలో భవనాల అద్దాలు ధ్వంసమైనట్లు నెటిజన్లు చెబుతున్నారు. పేలుడు ధాటికి ఓ భవనం కూలిపోయినట్లు ఇరాన్ మీడియా తెలిపింది. ఇదిలా ఉండగా.. రజేయిా ఓడరేవులో ప్రధానంగా కంటెయినర్ల కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. ఏటా 80 మిలియన్ టన్నుల సరకు ఎగుమతి, దిగుమతి అవుతుంది. స్థానికంగా చమురు ట్యాంకులు, పెట్రోకెమికల్ సౌకర్యాలు ఉన్నాయి.




# తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా?: మంత్రి కోమటిరెడ్డి

**కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుం-దని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు.**

ఈ కబురు,హైదరాబాద్: కాళేశ్వరం కథ త్వరలోనే అందరికీ తెలుస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రీడిజైనింగ్ పేరుతో కాళేశ్వరం చేపట్టి మోసం చేశారన్నారు. ''తెలివున్న వారెవరైనా కాళేశ్వరం చేపడతారా? మేడిగడ్డ కుంగిపోవడం చిన్న విషయం అన్నట్లుగా మాట్లాడారు. మేడిగడ్డ, సుందిళ్ల పనికిరావని ఎన్డీఎస్ఏ నివేదిక ఇచ్చింది. వాటిలో నీళ్లు నింపితే ఈపాటికే మొత్తం కొట్టుకుపోయేది. ప్రాజెక్టు నిర్మాణానికి తుమ్మిడిహట్టి సరైన ప్రాంతమని ఇంజినీర్లు చెప్పారు. తుమ్మిడిహట్టి పూర్తయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందని పక్కన పెట్టారు'' అని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు

# టెన్షన్ పడకండి.. అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే - హరీష్ రావు

ఈ కబురు: టెన్షన్ పడకండి.. అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ( రేపు ఎల్కతుర్తిలో జరుగబోయే సభ గురించి ప్రెస్ మీట్ పెట్టారు హరీష్ రావు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. కేసీఆర్ సభ కోసం కాంగ్రెస్ నాయకులు ఎక్కువగా ఎదురుచూస్తున్నారన్నారు. కేసీఆర్ ఏం మాట్లాడుతాడో అని కాంగ్రెస్ నాయకులకు టెన్షన్ మొదలైందని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు టెన్షన్ పడకండి.. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ పార్టీనే అని ధీమా వ్యక్తం చేశారు. 6 గ్యారంటీలంటూ కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని.. ఫైర్ అయ్యారు హరీష్ రావు. అయితే గెలిచిన తర్వాత మాత్రం... రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్యారంటీలను అమలు చేయడం లేదని మండిపడ్డారు. అందుకే ఇప్పుడు తెలంగాణ ప్రజలు మళ్ళీ గులాబీ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని చెప్పుకొచ్చారు. తాము నిర్వహించబోయే బహిరంగ సభ కోసం కూడా తెలంగాణ ప్రజలు మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని వెల్లడించారు. భారీ ఎత్తున ఈ సభకు తెలంగాణ ప్రజలు వస్తారని కూడా ఆయన స్పష్టం చేశారు.ఇది ఇలా ఉండగా.... హనుమకొండలోని



ఎల్కతుర్తి ప్రాంతంలో... గులాబీ పార్టీ నిర్వహించేబోయే రజతోత్సవ సభ జరగనుంది. దాదాపు 1300 ఎకరాలలో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నారు. ఆదివారం రోజున సాయంత్రం నాలుగు గంటలకు ఈ బహిరంగ సభ ఉంటుందని ఇప్పటికే గులాబీ పార్టీ నేతలు ప్రకటించారు. ఈ సభకు వచ్చేవారికి మంచి నీళ్లతో పాటు, ఫుడ్ కూడా రెడీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. వాటర్ బాటిల్లపై కెసిఆర్ ఫోటోలను పెట్టి మరి... పంచబోతున్నట్లు తెలుస్తోంది.

# నానక్ రామగూడలో
# స్మైలైన్ డెంటల్ హాస్పిటల్ ప్రారంభం



- అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో చికిత్స : ఏండీ డాక్టర్ రామకృష్ణ

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
డెంటల్ కేర్ రంగంలో ప్రసిద్ధి చెందిన స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ తన మూడో బ్రాంచ్ ను నానక్ రామ్ గూడలో ప్రారంభించింది. ఈ మేరకు శనివారం తమ నూతన బ్రాంచ్ ప్రారంభోత్సవం సందర్భంగా స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు దశాబ్దాలుగా దంత వైద్య రంగంలో సరికొత్త ప్రమాణాలు పాటిస్తూ రోగులకు అత్యుత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. ఐటీ ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా నానక్ రామ్ గూడ ఐటీ కారిడార్ లో మూడో బ్రాంచ్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు.

ఇప్పటికే పంజాగుట్ట, హైటెక్ సిటీ ప్రాంతాల్లో తమ బ్రాంచ్ ల ద్వారా సేవలందిస్తున్నామని చెప్పారు. ఆధునిక వైద్య పద్ధతులపై తమ నిబద్ధత స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ ను అగ్రపథంలో నిలిపిందన్నారు.

చికిత్స విధానంలో తాము అవలంభిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నిర్ధారణ పద్ధతులు అత్యంత కచ్చితత్వాన్ని అందిస్తాయని తెలిపారు. సీఈఆర్ఈసీ సిస్టమ్ ద్వారా అదే రోజు క్రౌన్‌లను ఏర్పాటు చేయవచ్చన్నారు. లేజర్ డెంటిస్ట్రీ తక్కువ నొప్పితో, స్వల్ప శస్త్రచికిత్సకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఈ సందర్భంగా



ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వాహకులతో ఏండీ రామకృష్ణ

స్మైలైన్ డెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు, డైరెక్టర్ డాక్టర్ సునీత మాట్లాడుతూ స్మైలైన్‌లో దంత వ్యాధులకు చికిత్స మాత్రమే చేయడం లేదని, మనుషులకు సేవ చేస్తున్నామని తెలిపారు. ప్రతి చిరునవ్వు వెనుక ప్రపంచ స్థాయి వైద్యం అందుబాటులో ఉంచడమే లక్ష్యమన్నారు. రోగుల సౌకర్యం,

భద్రతకు అధిక ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. నైపుణ్యం కలిగిన వైద్యుల పర్యవేక్షణలో, అత్యాధునిక డెంటల్ చైర్లలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. తనతో పాటు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ కీర్తి, డాక్టర్ ప్రీతి, డాక్టర్ అమూల్య ఉన్నారన్నారు.

# గచ్చిబౌలి డివిజన్ లో రూ.2.07 కోట్ల
# అభివృద్ధి పనులకు శంకుస్థాపన



నిధులు కేటాయించిన నాయకులకు కృతజ్ఞతలు తెలుపుతున్న స్థానికులు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

- పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని గచ్చిబౌలి డివిజన్ లో నూతనంగా 2.07 కోట్ల రూపాయల నిధులతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం తెలంగాణ పిఏసి చైర్మన్, శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డిలు శంకుస్థాపన చేశారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నవోదయ కాలనీలో 37 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, గోపన్ పల్లి విలేజ్, సోఫా కాలనీల్లో 50 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులకు, సాయి ఐశ్వర్య కాలనీ లో 38 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు, గచ్చిబౌలి టెలికాంనగర్ కాలనీలో 38 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న వరద నీటి కాల్వ నిర్మాణ పనులకు, వినాయక నగర్ కాలనీలో 44 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, కాలనీల అభివృద్దే ధ్యేయంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిధిలో మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తున్నామని అన్నారు. శేరిలింగంపల్లి ప్రజల సంక్షేమం, ఈ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, మార్గదర్శకత్వంలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ తనకు గచ్చిబౌలి డివిజన్ అభివృద్దే ప్రధాన ధ్యేయమని, రాజకీయాలకు అతీతంగా అందరి సహకారంతో డివిజన్ ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ముఖ్యంగా ఐటీ కారిడార్ తో కూడిన గచ్చిబౌలి డివిజన్ లో మన దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి, విదేశాల నుంచి వచ్చిన ప్రజలు నివాసం ఉంటారని, వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సీనియర్ నాయకులు, కార్యకర్తలు, జిహెచ్ఎంసి అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# గచ్చిబౌలి టీఎన్జీఓ కాలనీలో కొవ్వొత్తులతో ర్యాలీ

- పెహల్గామ్ మృతులకు శ్రద్ధాంజలి ఘటించిన స్థానికులు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
జమ్మూ కాశ్మీర్ పెహల్గామ్ లో పర్యాటకుల మీద తీవ్రవాదులు జరిపిన దాడికి నిరసనగా గచ్చిబౌలి టీఎన్జీఓ కాలనీలో శనివారం స్థానికులు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. శనివారం రాత్రి స్థానికులు కొవ్వొత్తులతో టీఎన్జీఓ కాలనీలో శాంతి ర్యాలీ నిర్వహించి, కాలనీ చౌరస్తా వద్ద ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కుటుంబంతో కలిసి సరదాగా వెళ్లిన పర్యాటకుల మీద తీవ్రవాదులు కాల్పులు జరిపి ప్రాణాలు తీయడం హేయమైన చర్య అని అన్నారు. పెహల్గామ్ దాడిలో మృతి చెందిన మృతుల కుటుంబాలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. దేశంలోని కుల, మతాలకు అతీతంగా ఈ దాడిని ఖండించాలని, దేశ భద్రత విషయంలో ప్రజలంతా ఏకతాటిపై నిలబడాలని పిలుపునిచ్చారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్న తీవ్రవాదుల ఏరివేత కోసం ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్న



టీఎన్జీవో కాలనీలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న స్థానికులు

ప్రజలంతా అండగా నిలవాలని అన్నారు భవిష్యత్తులో మరోసారి ఇటువంటి దుర్ఘటన చోటు చేసుకోకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీఎన్జీవో కాలనీ నాయకులు, కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



ప్రభుత్వ స్థలం ఆక్రమించి పనులు చేపడుతున్న జేసీబీ

# మియాపూర్ సర్వే నెంబర్ 100 ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

- హెచ్ఎండిఏ ఫెన్సింగ్ తొలిగించి ఆక్రమణ
- కబ్జాదారులపై మియాపూర్ లో కేసు నమోదు

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :**
మియాపూర్ లో కబ్జాదారులు బరితెగించారు. ప్రభుత్వ స్థలం రక్షణకు హెచ్ఎండిఏ వేసిన ఫెన్సింగ్ ను తొలగించి మరి కబ్జాకు ప్రయత్నించారు. హెచ్ఎండిఏ ఫెన్సింగ్ ను తొలగించి యదేచ్చగా మియాపూర్ సర్వే నెంబర్ 100లోని ప్రభుత్వ స్థలంలో పనులు చేపట్టారు. ప్రభుత్వ స్థలం రక్షణ కోసం అక్కడే గస్తీ విధులు నిర్వహిస్తున్న హెచ్ఎండిఏ సిబ్బంది విషయం గమనించి పోలీసులకు సమాచారం అందించడంతో మియాపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. కబ్జాదారులతోపాటు పనులు చేపట్టిన జెసిబి డ్రైవర్ మీద కేసు నమోదు చేసిన పోలీసులు జెసిబిని స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...
శేరిలింగంపల్లి మండల పరిధిలోని మియాపూర్ సర్వే 100లో 277.5 ఎకరాలు, సర్వే నెంబర్ 101లో 273.34 ఎకరాలు కలిపి మొత్తం 551 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిపై గత కొద్ది సంవత్సరాలుగా వివాదం నడుస్తుంది. సుప్రీంకోర్టులో సైతం ఈ భూమిపై పలు వివాదాలు పెండింగ్ లో ఉన్నాయి. సర్వే నెంబర్ 100, 101లలోని భూములు మొత్తం ప్రభుత్వ భూములేనని గతంలోనే హై కోర్టు తీర్పు ఇవ్వగా, పలువురు ప్రైవేట్ వ్యక్తులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా ఈ భూముల్లో గత సంవత్సరం క్రితం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పేదలు గుడిసెలు వేసి, చీరలు, తాళ్లు కట్టి కబ్జాకు యత్నించడం నాడు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం అయ్యింది. నాడు ఈ కబ్జాలను అడ్డుకునేందుకు పోలీసు యంత్రాంగం చెమటోడ్చింది. ప్రభుత్వ స్థలంపై అసత్య ప్రచారం చేసి పేదలను తప్పు దోవ పట్టించిన వారిపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేసి కబ్జాలను అడ్డుకున్నారు. అనంతర కాలంలో కోట్లాది రూపాయల విలువైన ఈ భూముల పరిరక్షణ కోసం హెచ్ఎండిఏ అడుగులు వేసింది. ఇందులో భాగంగా సర్వేనెంబర్ 100, 101లలోని భూముల చుట్టూ భారీ ఖర్చుతో పెన్సింగ్ ఏర్పాటు చేసి నిరంతర గస్తీ కోసం సిబ్బందిని నియమించింది. నాటి నుంచి హెచ్ఎండిఏ సిబ్బంది ఈ భూముల రక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. కాగా శుక్రవారం కొంతమంది కబ్జాదారులు హెచ్ఎండిఏ ఆధీనంలోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించడం సంచలనంగా మారింది. మియాపూర్ పరిధిలోని ఎంఏ నగర్ బస్తీ సమీపంలో హెచ్ఎండిఏ వేసిన ఫెన్సింగ్ ను తొలగించి ఏసీబీతో ప్రభుత్వ స్థలంలోకి ప్రవేశించారు. వెంకటేశ్వర రావు అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి ఫెన్సింగ్ తొలగించి, జేసీబీ డ్రైవర్ దత్తుతో ప్రభుత్వ స్థలంలో భూమి చదును పనులు చేపట్టారు. కాగా ఈ భూమి రక్షణ కోసం సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న హెచ్ఎండిఏ సిబ్బంది విషయం గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. వెంటనే సంఘటనాస్థలికి చేరుకున్న హెచ్ఎండిఏ అధికారులు కబ్జాదారులు తొలగించిన ఫెన్సింగ్ ను, చేపట్టిన భూమి చదును పనులను పరిశీలించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడుతున్న వెంకటేశ్వరరావుతో పాటు అతని అనుచరులు, భూమిని చదును చేస్తున్న జేసీబీ డ్రైవర్ దత్తుల మీద మియాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరి ఫిర్యాదుపై స్పందించిన మియాపూర్ పోలీసులు వెంకటేశ్వరరావు, దత్తులతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రభుత్వ స్థలంలో పనులు చేపడుతున్న జెసిబిని స్వాధీనం చేసుకొని మియాపూర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.



వాల్ పోస్టర్ అంటిస్తున్న రాగం జంగయ్య యాదవ్

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరండి : రాగం జంగయ్య యాదవ్

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబర్ రాగం జంగయ్య యాదవ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గౌలిదొడ్డి లో రజతోత్సవ సభ వాల్ పోస్టర్ ను అంటించి స్థానికంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా ప్రారంభించిన బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకుంటుందని అన్నారు. దశాబ్దాల తెలంగాణ రాష్ట్ర ప్రజల ప్రత్యేక రాష్ట్ర కలను సాకారం చేసి, రాష్ట్రాన్ని సాధించి పెట్టడంతో పాటు పదేళ్ల పాటు అధికారంలో ఉండి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్లిన ఘనత కెసిఆర్ దేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా రజతోత్సవ సభను వరంగల్ వేదికగా నిర్వహిస్తుందన్నారు. ఆదివారం జరగనున్న బహిరంగ సభకు గచ్చిబౌలి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఉద్యమకారులు భారీ ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. రజతోత్సవ సభకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసిఆర్, పార్టీ అగ్ర నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై అధినేత కెసిఆర్ దిశా నిర్దేశం చేయనున్నారని అన్నారు. రాష్ట్రంలో ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రజా సమస్యలపై మరోసారి ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



## 2025 హంటర్ 350 బైక్ ఇదే: ధర ఎంతంటే?

రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎట్టకేలకు దాని అత్యంత సరసమైన మోటార్‌సైకిల్.. హంటర్ 350ను కొత్త హంగులతో 2025 వెర్షన్‌గా మార్కెట్లో లాంచ్ చేసింది. ఈ బైక్ ధర రూ. 1.50 లక్షలు (ఎక్స్ షోరూమ్). ఇది దాని స్టాండర్డ్ మోడల్ కంటే ఎక్కువ అప్‌గ్రేడ్‌లను పొందుతుంది.

2025 హంటర్ 350 బైకులో అతిపెద్ద మార్పు సస్పెన్షన్ అప్‌గ్రేడ్. వెనుక భాగంలో మెరుగైన కంప్రెషన్ & రీబౌండ్ అనుభవాలను అందించే ప్రోగ్రెసివ్ స్ప్రింగ్‌లు లభిస్తాయి. అంతే కాకుండా ఇందులో స్లిప్ అండ్ క్లచ్ అసిస్ట్ క్లచ్ కూడా ఉంది. కొత్త హ్యాండిల్‌బార్, ఫాస్ట్ USB ఛార్జింగ్, కొత్త సీటు, కొత్త ఎగ్జాస్ట్ రూటింగ్ మాత్రమే కాకుండా పెరిగిన గ్రౌండ్ క్లియరెన్స్ వంటివి ఇక్కడ చూడవచ్చు.

పర్ఫామెన్స్ పరంగా, ఇంజిన్‌లో ఎటువంటి మార్పులు లేవు. ఈ బైక్ మూడు కొత్త రంగులలో లభిస్తుంది. ఎంట్రీలెవల్ మోడల్ ధర రూ. 1.50 లక్షలు, మిడ్ వేరియంట్ ధర రూ. 1.77 లక్షలు, టాప్ ఎండ్ ధర రూ. 1.82 లక్షలు (అన్ని ధరలు, ఎక్స్ షోరూమ్).



ప్రమాదం జరిగిన హోటల్



కాలిన గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

## టీఎన్జీవో కాలనీలో గ్యాస్ లీకేజీతో వ్యాపించిన మంటలు

**హోటల్లో పనిచేస్తున్న ఇద్దరికీ గాయాలు**

**ఈ-కబురు, శేరిలింగంపల్లి :** గచ్చిబౌలి ఐటీ కారిడార్ పరిధిలోని టీఎన్జీవో కాలనీలో గల ఓ హోటల్ లో గ్యాస్ లీకేజీ కారణంగా మంటలు వ్యాపించడంతో హోటల్లో పనిచేస్తున్న ఇద్దరికీ గాయాలయ్యాయి. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలిలోని టీఎన్జీవోస్ కాలనీలో కిరణ్ అనే వ్యక్తి హంగ్రీ ఇడ్లీ పేరిట హోటల్ నిర్వహిస్తున్నాడు. హోటల్లో పని చేసే వంటమనుషులు రాజీవ్(35), శంకర్(23) లు శనివారం ఉదయం 6.30 గంటల సమయంలో హోటల్ కు వచ్చారు. స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు చెలరేగి గాయాల బారినపడ్డారు. గ్యాస్ లీక్ కావడం గుర్తించకుండా స్టవ్ వెలిగించగా ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో

రాజీవ్ కు 30 శాతం. శంకర్ కు 40 శాతం గాయాలయ్యాయి. ప్రస్తుతం వీరు పొట్ట, కాళ్లు, చేతులకు కాలిన గాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# రూ.10 లక్షల కోట్ల రిలయన్స్

**'అంతర్జాతీయ వ్యాపారానికి 2024-25 సవాళ్లు విసిరినా, రిలయన్స్ స్థిరమైన పనితీరునే ప్రదర్శించింది. ఇంధన మార్కెట్లలో ఊగిసలాటలున్నా ఓ2సీ విభాగం రాణించింది.**

**ఈ స్థాయి నికర విలువ గల తొలి కంపెనీ**
**త్రైమాసిక లాభం రూ.19,407 కోట్లు**
**డివిడెండు రూ.5.50**

'అంతర్జాతీయ వ్యాపారానికి 202425 సవాళ్లు విసిరినా, రిలయన్స్ స్థిరమైన పనితీరునే ప్రదర్శించింది. ఇంధన మార్కెట్లలో ఊగిసలాటలున్నా ఓ2సీ విభాగం రాణించింది. రిటెయిల్ విభాగమూ స్థిర వృద్ధిని నమోదు చేసింది. డిజిటల్ సేవల వ్యాపారం రికార్డు స్థాయి ఆదాయం, లాభాలను నమోదు చేసింది. కొత్త ఇంధన వ్యాపారంలో వేస్తున్న బలమైన పునాది నేపథ్యంలో, రానున్న త్రైమాసికాల్లో మా వ్యాపారంలో అనూహ్య మార్పులు చూస్తారు.'

**రిలయన్స్ ఇండస్ట్రీస్ అధిపతి ముకేశ్ అంబానీ**

**ముంబయి:** రిలయన్స్ ఇండస్ట్రీస్ ఆర్థిక ఫలితాల్లో రాణించింది. రిటెయిల్ వ్యాపారం పుంజుకోవడం, టెలికాంలో మార్జిన్లు పెరగడం, అంతర్జాతీయ ధోరణికి భిన్నంగా చమురు వ్యాపారం రాణించడంతో మార్చి త్రైమాసికంలో సంస్థ ఏకీకృత నికర లాభం రూ.19,407 కోట్ల (ఒక్కో



షేరుకు రూ.14.34)కు చేరింది. 202324 ఇదే కాల లాభం రూ.18,951 కోట్ల (ఒక్కో షేరుకు రూ.14)తో పోలిస్తే ఇది 2.4% అధికం. కంపెనీ కార్యకలాపాల ఆదాయం రూ.2.6 లక్షల కోట్లకు పెరిగింది. 2024 జనవరిమార్చిలో ఇది రూ.2.4 లక్షల కోట్లుగా ఉంది.

**రిటెయిల్ లాభాల్లో 29% వృద్ధి:** రిలయన్స్ రిటెయిల్ వెంచర్ నికర లాభం 29.1% వృద్ధితో రూ.3,545 కోట్లకు, స్థూల ఆదాయం 15.65% పెరిగి రూ.88,620 కోట్లకు చేరుకున్నాయి. పూర్తి ఆర్థికంలో స్థూల ఆదాయాలు రూ.3,30,870 కోట్లకు, నికర లాభం రూ.12,388 కోట్లకు చేరాయి. 202324తో పోలిస్తే ఇవి వరుసగా 7.85%, 11.33% వృద్ధి చెందాయి. డిజిటల్ కామర్స్, న్యూ కామర్స్ విభాగాలు మొత్తం ఆదాయంలో 18% వాటా పొందాయి. 202425లో కొత్తగా 2659 స్టోర్లను తెరవడంతో మొత్తం స్టోర్ల సంఖ్య 19,340కు చేరింది. రిలయన్స్ రిటెయిల్‌కే చెందిన వినియోగదారు వ్యాపార ఆదాయం 202425లో రూ.11,500 కోట్లకు చేరింది.

ఓ2సీ విభాగంలో కంపెనీ ఎబిటా నాలుగో త్రైమాసికంలో 10% తగ్గి రూ.15,080 కోట్లకు చేరుకుంది.

**జియో ప్లాట్‌ఫామ్స్ లాభంలో 25.7% వృద్ధి:** కంపెనీ డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ నికర లాభం 202425 మార్చి త్రైమాసికంలో రూ.7,022 కోట్లకు పెరిగింది. 202324 ఇదే కాల లాభం రూ.5,587 కోట్ల కంటే ఇది 25.7% అధికం. ఒక్కో వినియోగదారుపై సగటు ఆదాయం (ఆర్పు) రూ.181.7 నుంచి 13.5% పెరిగి రూ.206.2కు చేరింది. ఆదాయాలు రూ.28,871 కోట్ల నుంచి 17.7% వృద్ధితో రూ.33,986 కోట్లకు చేరాయి. 202425 మొత్తంమీద లాభం 22% వృద్ధితో రూ.26,120 కోట్లకు; ఆదాయం 17% పెరిగి రూ.1,28,218 కోట్లకు చేరాయి.

**పూర్తి ఆర్థిక సంవత్సరానికి: వార్షిక లాభాలు పెద్దగా మార్పు లేకుండా రూ.69,648 కోట్లుగా నమోదయ్యాయి. 2024-25లో రూ.10 లక్షల కోట్ల (దాదాపు 120 బి. డాలర్ల) నికర విలువకు చేరుకున్న తొలి కంపెనీ ఇదే. కంపెనీ ఆస్తులను లెక్కగట్టి, అందులో నుంచి కంపెనీ చెల్లించాల్సిన బాధ్యతల మొత్తాన్ని తీసివేయగా వచ్చేదే కంపెనీ నికర విలువ. గతేడాది రూ.20 లక్షల కోట్ల మార్కెట్ విలువను చేరుకున్న తొలి కంపెనీగా రిలయన్స్ నిలిచింది. మార్చి ఆఖరుకు కంపెనీ అప్పులు రూ.3.47 లక్షల కోట్లకు పెరిగాయి. 2024 మార్చి ఆఖరుకు ఇవి రూ.3.24 లక్షల కోట్లే.**

జియోస్టార్ ఆదాయం రూ.10,006 కోట్లకు చేరుకుంది. జియోహాట్‌స్టార్ పెయిడ్ వినియోగదార్ల సంఖ్య 10 కోట్లను మించింది.

202425 ఏడాదికి రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరుకు రూ.5.50 (55%) డివిడెండును కంపెనీ ప్రకటించింది.

## భారత్‌లో పని చేసే జనాభా కంటే వేగంగా

# ఉద్యోగాల పెరుగుదల: ప్రపంచ బ్యాంకు

**భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలలో సానుకూల పవనాలు వీస్తున్నట్లు ప్రపంచ బ్యాంకు తన తాజా నివేదికలో వెల్లడించింది.**

భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలకు సంబంధించి ప్రపంచ బ్యాంకు నివేదిక విడుదల చేసింది. భారత్‌లో ఉద్యోగాల పెరుగుదలలో సానుకూల పవనాలు వీస్తున్నట్లు అందులో పేర్కొంది. 202122 నుంచి దేశంలోని కార్మిక మార్కెట్ డైనమిక్స్‌లో గణనీయమైన మార్పు చోటుచేసుకుందని తెలిపింది. ఇందులోభాగంగా నాటి నుంచి పని చేసే జనాభా కంటే వేగంగా ఉద్యోగాల సృష్టి జరుగుతోందని వెల్లడించింది. అంతేకాకుండా శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు నివేదించింది.

గత మూడేళ్లుగా దేశంలో పనిచేసే జనాభా కంటే ఉపాధి వృద్ధి స్థిరంగా ఉందని.. పట్టణాలలో నిరుద్యోగ స్థాయిలు తగ్గుతున్నాయని నివేదిక వెల్లడించింది. 201718 ఆర్థిక సంవత్సరం తర్వాత పట్టణ నిరుద్యోగం తగ్గుతూ వచ్చి 202122 నాటికి అత్యల్పంగా 6.6 శాతానికి పడిపోయిందని ప్రపంచ బ్యాంకు




పేర్కొంది. కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఉపాధి అవకాశాలు మళ్లీ మెరుగుపడ్డాయనడానికి ఇదే సంకేతమని నిపుణులు పేర్కొంటున్నారు.

ఉపాధి రంగంలో గమనించదగ్గ మార్పుల్లో ఉద్యోగాల కోసం గ్రామీణప్రాంతాల ప్రజలు అధికంగా పట్టణ ప్రాంతాలకు వలసలు రావడం పెరిగినట్లు నివేదిక పేర్కొంది. 201819 తర్వాత మొదటిసారిగా.. ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాలకు పురుషుల వలసలు గణనీయంగా పెరిగాయని తెలిపింది. అయితే గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అధికంగా శ్రామిక శక్తిలోకి, ముఖ్యంగా వ్యవసాయ వృత్తిలోకి ప్రవేశిస్తున్నట్లు వివరించింది. మహిళా ఉద్యోగ రేటు పెరుగుతున్నప్పటికీ వేతనాల్లో లింగ అసమానతలు అలాగే ఉన్నాయని పేర్కొంది.

ఉద్యోగాలు పెరుగుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగ యువత శాతం పెరుగుతుండడంపై ప్రపంచ బ్యాంకు ఆందోళన వ్యక్తంచేసింది. భారత్‌లో నిరుద్యోగ యువత 13.3 శాతం ఉందని తెలిపింది. ఉన్నత విద్యను పూర్తిచేసిన వారిలో 29 శాతం మంది ఇప్పటికీ ఉద్యోగ అన్వేషకులుగానే ఉన్నారని పేర్కొంది. 202223 నాటికి భారత్‌లో పేదరికాన్ని తగ్గించడంలో కొంత పురోగతి సాధించినప్పటికీ, అత్యధిక జనాభా కలిగిన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు ఇప్పటికీ దేశంలోని అత్యంత పేద రాష్ట్రాలుగా ఉన్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. ఉపాధిని మరింత మెరుగుపరచడానికి స్థిరమైన ఆర్థిక సంస్కరణలు, పెట్టుబడుల పెరుగుదల అవసరమని విశ్లేషకులు సూచిస్తున్నారు.



# పెరిగిన అద్దెలు..

## హైదరాబాద్‌లో అక్కడే ఫుల్ డిమాండ్!

**ప్రధాన నగరాల్లో పెరుగుతున్న అద్దె గృహాల విపణి**
**పశ్చిమ హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్**


కొనేటప్పుడు తక్కువ ధరకు కావాలి.. అమ్మేటప్పుడు ఎక్కువ ధర రావాలని కోరుకునేది స్థిరాస్తి రంగంలోనే.. ఇది అద్దె విభాగానికీ వర్తిస్తుంది. గత కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాలలో అద్దె గృహాల మార్కెట్ క్రమంగా పెరుగుతోంది. ప్రధానంగా మెరుగైన ప్రయాణ సాధనాలు, పని కేంద్రాలకు చేరువలో ఉన్న అద్దె ఇళ్లకు డిమాండ్ ఉంది.

ప్రాపర్టీల విలువ పెరగడంతో గృహ యజమానులు అద్దెల కంటే లాభదాయకమైన ఆస్తుల విక్రయాల కోసం అన్వేషిస్తుండంతో సప్లయ్ తగ్గింది. దీంతో అద్దె గృహాలకు డిమాండ్‌తో పాటు రెంట్లు కూడా పెరిగాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తొలి త్రైమాసికంలో హైదరాబాద్‌లో అద్దె గృహాలకు డిమాండ్ 22 శాతం మేర పెరిగింది. సరఫరా 2.1 శాతం క్షీణించగా.. సగటు రెంట్లు 4.5 శాతం మేర పెరిగాయి. అద్దెల మార్కెట్‌లో డిమాండ్ 50, సప్లయి వాటా 39 శాతంగా ఉన్నాయి.

**పశ్చిమంలో డిమాండ్ ఎక్కువ..**

గచ్చిబౌలి, మాదాపూర్ వంటి పశ్చిమ హైదరాబాద్ ప్రాంతాల్లోని అద్దె గృహాలకు డిమాండ్ ఎక్కువగా ఉంది. కార్యాలయాలు, ఉపాధి కేంద్రాలకు సమీపంలో ఉండటం, ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్)తో మెరుగైన కనెక్టివిటీనే ప్రధాన కారణం. రూ.25 వేలు నుంచి రూ.35 వేలు నెలవారీ అద్దెలకు కోసం ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. 1,000 చ.అ. నుంచి 1,500 చ.అ. విస్తీర్ణంలో ఉన్న గృహాలకు డిమాండ్ అధికంగా ఉంది.

## పాక్ గగనతలం మూసివేత.. విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ



**భారత్‌కు చెందిన విమానాలు రాకుండా పాకిస్థాన్ గగనతలం మూసివేసిన నేపథ్యంలో విమానయాన సంస్థలకు డీజీసీఏ అడ్వైజరీ జారీ చేసింది.**

**జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్- పాక్ మధ్య ద్వైపాక్షిక ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈక్రమంలో భారత్‌కు చెందిన విమానాలకు తమ గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇటీవల పాకిస్థాన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ విమానయాన సంస్థలకు పలు సూచనలు జారీ చేసింది.**

పాక్ గగనతలం మూసివేత కారణంగా ఎయిర్‌లైన్ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయని డీజీసీఏ పేర్కొంది. అంతర్జాతీయ విమానాల రాకపోకలకు ప్రయాణ సమయం పెరగనున్నట్లు తెలిపింది. ఈక్రమంలోనే విమానయాన సంస్థలకు పలు అడ్వైజరీలు జారీ చేసింది. విమానాల ల్యాండింగ్, టేకాఫ్‌లకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని ప్రయాణికులకు అందించాలని సూచించింది. అంతేకాక.. విమానాల్లో ప్రయాణికులకు భోజనం, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సదుపాయం, కస్టమర్‌కేర్ సర్వీసులతో సహా ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని పేర్కొంది.

పహల్గాం లో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. పాక్‌తో దౌత్య సంబంధాలకు సంబంధించి భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది. సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేయడంతో పాటు పాక్ పౌరులు తక్షణమే భారత్ విడిచివెళ్లాలని ఆదేశించింది. ఈ చర్యలతో దాయాది దేశం అక్కసు వెళ్లగక్కుతూ.. సిమ్లా ఒప్పందంతో పాటు మిగిలిన ద్వైపాక్షిక ఒప్పందాలను పక్కన బెడుతున్నట్లు ప్రకటించింది. తమ గగనతలంలో భారత్‌కు చెందిన విమానాలకు అనుమతిని నిలిపేస్తున్నట్లు వెల్లడించింది.



# ఆంటీ పాత్రలు నాకిష్టమే.. ఆమె సెటైర్లతో నాకు బాగా తెలిసొచ్చింది

**రెండు కొప్పులు ఒకచోట ఇమడవు అంటుంటారు. అది నిజమే అంటోంది హీరోయిన్ సిమ్రాన్ . ఈమె ఇటీవలే గుడ్ బ్యాడ్ అగ్లీ సినిమాలో అతిథి పాత్రలో నటించింది. సినిమా రిలీజయ్యాక జరిగిన ఓ అవార్డు ఫంక్షన్‌లో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని బయటపెట్టింది. నేను ఆంటీ రోల్స్ చేస్తున్నానని ఓ నటి ఎగతాళి చేసిందని తెలిపింది. పనికిమాలిన డబ్బా పాత్రల్లో నటించడం కంటే అమ్మ, ఆంటీ రోల్స్ చేయడం ఎంతో ఉత్తమం అని స్టేజీపైనే నటికి కౌంటర్ ఇచ్చింది.**

**లైలా? జ్యోతిక? ఎవరన్నారు?**


లైలా గురించే సిమ్రాన్ ఈ కామెంట్స్ చేసిందన్న ప్రచారం జరిగింది. మరికొందరేమో డబ్బా అన్న పదం వాడిందంటే డబ్బా కార్టెల్ సిరీస్‌లో నటించిన జ్యోతికపై ఈ వ్యాఖ్యలు చేసిందేమో నన్న అనుమానాలు కూడా వ్యక్తమయ్యాయి. తాజాగా సిమ్రాన్ ఓ ఇంటర్వ్యూలో తన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చింది. ఆమె మాట్లాడుతూ.. ఆమె మాటల వల్ల నాకు నిజంగా బాధేసింది. అందుకే నా బాధను చెప్పుకున్నాను. కెరీర్ ఆరంభం నుంచే నేను ఆంటీ పాత్రలు చేస్తున్నాను.

**ఆంటీ అనే పదం ఇష్టం**

ఆంటీ అనే పదాన్ని అవమానంగా ఫీలవను.. ఇష్టంగానే భావిస్తాను. ఆ పాత్రలు చేయడం తప్పేం కాదు. ఇదంతా జరిగాక నాకో విషయం అర్థమైంది. సినీ ఇండస్ట్రీలో హీరోయిన్లెప్పుడూ ఫ్రెండ్స్ కాలేరని రుజువైంది. ఫ్రెండ్ అనుకున్న వాళ్లే మనపై అలాంటి కామెంట్లు చేస్తే మనసుకు బాధగా అనిపిస్తుంది. ఆమె తర్వాతిరోజు క్యాజువల్‌గానే మాట్లాడింది. కానీ మా స్నేహం మునుపటిలా మాత్రం కొనసాగదు అని సిమ్రాన్ చెప్పుకొచ్చింది. కానీ తనపై సెటైర్లు వేసిందెవరన్నది మాత్రం సిమ్రాన్ వెల్లడించలేదు.

# కాపీ రైట్స్ కేసు.. దిల్‌రాజుకు మధ్యంతర రక్షణ కొనసాగింపు

**మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ కేసులో సుప్రీంకోర్టు ఉత్తర్వులు**



**ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కు ఇచ్చిన మధ్యంతర రక్షణను సుప్రీంకోర్టు కొనసాగించింది. మిస్టర్ పర్‌ఫెక్ట్ సినిమా కాపీరైట్ వివాదానికి సంబంధించి నిర్మాత వి.వెంకటరమణారెడ్డి అలియాస్ దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలంటూ సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు ఇప్పటికే మధ్యంతర రక్షణ ఇచ్చింది. అంతేగాక తదుపరి విచారణ వరకు దిల్ రాజుపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. శుక్రవారం సుప్రీంకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా మధ్యంతర రక్షణను కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.**

**ఏమిటీ కేసు?**

'నా మనసు నిన్ను కోరే నవల' ఆధారంగా 'మిస్టర్ పర్‌ఫెక్ట్' అనే సినిమా తీశారంటూ రచయిత్రి ముమ్ముడి శ్యామలాదేవి 2017లో దిల్ రాజుపై కేసు పెట్టారు. దీంతో మాదాపూర్ పోలీసులు నిర్మాత దిల్ రాజుపై కాపీ రైట్ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ తర్వాత ఈ కేసు విచారణ హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో జరిగింది. విచారణ సందర్భంగా ఇరుపక్షాల వాదనలు విన్న సిటీ సివిల్ కోర్టు, సాక్ష్యాలను పరిశీలించి దిల్ రాజుపై చర్యలు తీసుకోవాలని 2019లో ఆదేశించింది.

**మధ్యంతర రక్షణ**

ఈ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ దిల్‌రాజు సుప్రీంకోర్టును ఆశ్రయించగా జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. దిల్ రాజుపై చర్యల విషయంలో గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణను కొనసాగించిన జస్టిస్ జె.బి.పార్దీవాలా ధర్మాసనం, తదుపరి విచారణను వాయిదా వేస్తూ.. అప్పటి వరకు సిటీ సివిల్ కోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది.

**టాలీవుడ్ హీరో ప్రియదర్శి వరుస సినిమాలతో దూసుకెళ్తున్నారు. ఇటీవలే కోర్ట్ మూవీతో సక్సెస్ అందుకున్న ప్రియదర్శి మరో మూవీతో ప్రేక్షకులు ముందుకొచ్చారు. మోహనకృష్ణ ఇంద్రగంటి డైరెక్షన్‌లో వచ్చిన సారంగపాణి జాతకం ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. తొలి రోజే సక్సెస్ టాక్ రావడంతో ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోంది.**



# ప్రియదర్శిపై స్టార్ హీరో దంపతుల ప్రశంసలు .. ఎవరో తెలుసా?

ఇదిలా ఉండగా కోర్ట్ మూవీలో ప్రియదర్శి లాయర్ పాత్రలో అభిమానుల ముందుకొచ్చారు. ఈ పాత్రలో తనదైన నటనతో అందరినీ కట్టిపడేశారు. ఈ మూవీపై విమర్శకులు సైతం ప్రశంసలు కురిపించారు. తాజాగా ఈ మూవీలో ప్రియదర్శి నటనపై కోలీవుడ్ స్టార్ దంపతులు సైతం ఫిదా అయ్యారు. తాజాగా సూర్య, జ్యోతిక జంట ప్రియదర్శి నటనను కొనియాడారు. ప్రియదర్శికి ఓ ఫ్లవర్ బొకేతో పాటు చిన్న లెటర్‌ను పంపించారు. ఈ విషయాన్ని ప్రియదర్శి ట్విటర్‌లో షేర్ చేశారు.

ప్రియదర్శి తన పోస్ట్‌లో రాస్తూ.. 'మీరు పంపిన సందేశం, పువ్వులు అందుకోవడం నా హృదయాన్ని తాకింది. ఈ ఫీలింగ్‌ను మాటల్లో చెప్పలేను. ఇద్దరు న్యాయవాదులు చంద్రు, వెంబా వెనక నుంచి గర్వంగా తట్టినట్లుగా అనిపించింది. నన్ను బాగా ప్రేరేపించిన ఆ ఇద్దరికీ చాలా ధన్యవాదాలు' అంటూ పోస్ట్ చేశారు. కాగా..కోర్ట్ మూవీలో జూనియర్ లాయర్ సూర్యతేజ పాత్రలో ప్రియదర్శి కనిపించారు.



# ఈ రేంజ్ కాస్ట్ లీ బహుమతి.. ఏమిచ్చాడంటే?

**తెలుగులో పలు సినిమాల్లో హీరోయిన్‌గా చేసిన కియారా అడ్వాణీ ప్రస్తుతం ప్రెగ్నెన్సీతో ఉంది. చివరగా రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'లో కనిపించింది. ఈమె చేసిన రెండు సినిమాలు త్వరలో రిలీజ్ కాబోతున్నాయి. సరే ఈ విషయాలన్నీ పక్కనబెడితే ఈమెకు ఇప్పుడు భర్త ఖరీదైన కారుని బహుమతిగా ఇచ్చాడు.**

2014నుంచి ఇండస్ట్రీలో ఉన్న కియారా.. బాలీవుడ్ కే చెందిన సిద్ధార్థ్ మల్హోత్రాని ప్రేమించింది. కలిసి సినిమాలు కూడా చేసిన వీళ్లిద్దరూ 2023లో గ్రాండ్ గా పెళ్లి చేసుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి చివరలో శుభవార్త చెప్పింది. తాను గర్భంతోఉన్నానని బయటపెట్టింది. ఈ మేరకు ఇన్ స్టాలో పోస్ట్ కూడా పెట్టింది.

తాజాగా నెలవారీ చెకప్స్ కోసం భర్త సిద్దార్థ్ తో కలిసి ముంబైలోని ఓ ఆస్పత్రికి కియారా వెళ్లింది. వీళ్లిద్దరూ కూడా ఓ లగ్జరీ కారులో వచ్చారు. టొయాటో కంపెనీకి చెందిన వెల్ ఫైర్‌అనే మోడల్ కారు ఇది. దీని ధర మార్కెట్ లో రూ.1.22 కోట్లకు పైనే ఉందని తెలుస్తోంది. కియారా ప్రెగ్నెంట్ అని తెలిసిన వెంటనే భర్త సిద్ధార్థ్ మల్హోత్రా ఈమెకు ఈ కారుని బహుమతిగా ఇచ్చాడట. మిగతా వాటితో పోలిస్తే లోపల స్పేస్, కూర్చోవడానికి చాలా సౌకర్యంగా ఉండటమే దీనికి కారణమని తెలుస్తోంది. ఈ విషయం గురించి బాలీవుడ్ లో మాట్లాడుకుంటున్నారు.

# దేశమంతా విషాదంలో ఉంటే వెకేషన్‌కు వెళ్తావా అంటూ నెటిజన్ కామెంట్.. రష్మీ ఏమన్నారంటే

**యాంకర్ రష్మీ తాజాగా బాలి టూర్‌కు వెళ్లారు. దీనిపై ఓ నెటిజన్ విమర్శలు చేయగా.. ఆమె తనదైన శైలిలో స్పందించారు.**

శస్త్ర చికిత్స అనంతరం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు నటి రష్మీ . ఇందులో భాగంగా మానసిక ప్రశాంతత, తన పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకోవాలనే ఉద్దేశంతో ఆమె తాజాగా బాలి టూర్‌కు వెళ్లారు. వెకేషన్‌లో భాగంగా దిగిన కొన్ని ఫొటోలను ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. దీనిపై ఓ నెటిజన్ స్పందిస్తూ.. "పహల్గాం ఉగ్రదాడి వేళ దేశం మొత్తం విషాదంలో మునిగి ఉంటే నువ్వు మాత్రం వెకేషన్ కోసం వెళ్తావా" అని ప్రశ్నించాడు. దీనిపై ఆమె తనదైన శైలిలో స్పందించారు.

నెటిజన్ కామెంట్‌ను స్క్రీన్ షాట్ తీసుకున్న ఆమె.. దానిని ఎక్స్ వేదికగా షేర్ చేశారు. " ప్రస్తుతం నేను బాలిలో ఉన్నా. నా సంస్కృతి, సాంప్రదాయాలకు ఈ దేశం ఎంతో చేరువగా ఉంటుంది. అందుకే ఇక్కడికి వచ్చా. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఇది రెండు నెలల క్రితమే ప్లాన్ చేసిన ట్రిప్. పుట్టినరోజుకు ప్రతి ఏడాది ఏదో ఒక ప్రాంతానికి టూర్‌కు వెళ్లడం నాకు ఇష్టం. కాబట్టి రేపు నా పుట్టినరోజుకు విషెస్ చెప్పడం మర్చిపోవద్దు. అంతేకాకుండా నేను శస్త్రచికిత్స నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నా" అని ఆమె చెప్పారు.

తీవ్రమైన భుజం నొప్పి, అకాల రక్తస్రావంతో తాను ఇబ్బందిపడినట్లు ఇటీవల రష్మీ తెలిపారు. వైద్యులను సంప్రదించానని.. ఈ నెల 18న శస్త్రచికిత్స జరిగిందని ఆమె తెలిపారు. ఆపరేషన్ ముందు దిగిన ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్నారు. మరో మూడు వారాలు తాను విశ్రాంతిలోనే ఉంటానని.. ఆ తర్వాత వర్క్‌పై దృష్టి పెడతానని అన్నారు. ఈక్రమంలోనే ఆమె తాజాగా ఇన్‌స్టా వేదికగా బాలి టూర్ ఫొటోలు పంచుకున్నారు. "ఎన్నో సాహసాలు, ప్రకృతి అందాలను ఆస్వాదించాలనే ఉద్దేశంతో రెండు నెలల క్రితం ఈ టూర్ ప్లాన్ చేశా. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారాయి. నిద్రపోవడం, నచ్చిన ఫుడ్ తినడంతోనే ఈ టూర్ గడుస్తోంది. జీవితంలో కొత్త విషయాలను నేర్పించడానికి భగవంతుడు వింతైన మార్గాలు ఎంచుకుంటాడని అనిపిస్తోంది" అని ఆమె రాసుకొచ్చారు.



# వారి విడాకులు.. ఆ సమయంలో జీవితపాఠం నేర్చుకున్నా: శ్రుతి హాసన్


**తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలో తాను ఎంతో బాధ పడినట్లు శ్రుతి హాసన్ తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ విషయంపై మాట్లాడారు.**

కమల్‌హాసన్ కుమార్తెగా ఇండస్ట్రీకి పరిచయమై తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు నటి శ్రుతి హాసన్. సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ తాను ఎప్పుడూ దాన్ని దృష్టిలో పెట్టుకోలేదని తాజాగా వెల్లడించారు. ఇండస్ట్రీకి రావడానికి ముందు ఎన్నో విషయాలు తెలుసుకున్నట్లు తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రుతి తన చిన్ననాటి విషయాలు పంచుకున్నారు. తన తల్లిదండ్రులు విడాకులు తీసుకున్న సమయంలోనే తాను జీవిత పాఠం నేర్చుకున్నట్లు చెప్పారు.

''నేను ఇండస్ట్రీకి రావడానికి ముందు నా జీవితంలో ఏం జరిగిందో చాలామందికి తెలియదు. నా తల్లిదండ్రులు విడిపోవడం నన్ను ఎంతో బాధించింది. వారిద్దరూ విడిపోయాక నేను అమ్మతో ఉన్నాను. అప్పటివరకు ఉన్న జీవితం ఒక్కసారిగా మారిపోయింది. చెన్నై నుంచి ముంబయి వచ్చేశాం. విలాసవంతమైన జీవితం దూరమైంది. అప్పటివరకూ మెర్సిడెస్ బెంజ్ కారులో తిరిగిన నేను లోకల్ ట్రైన్‌లో ప్రయాణించాను. రెండు రకాల జీవితాలు చూశాను. ఇండస్ట్రీకి వచ్చాక నాన్నతో ఎక్కువగా ఉంటున్నాను. విదేశాల్లో సంగీతం నేర్చుకున్నాను. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాను. స్వతంత్రంగా, ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నాను'' అని చెప్పారు. శ్రుతిహాసన్ తల్లిదండ్రులు కమల్ హాసన్ , సారిక 2004లో విడిపోయిన సంగతి తెలిసిందే.

ప్రస్తుతం శ్రుతి 'కూలీ' సినిమాలో నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా లోకేశ్ కనగరాజ్ దీన్ని రూపొందిస్తున్నారు. నాగార్జున, ఉపేంద్ర తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. బంగారం స్మగ్లింగ్ అంశంతో ముడిపడి ఉన్న యాక్షన్ కథాంశంతో ఇది ముస్తాబవుతోంది. ఆగస్టు 14న ఇది ప్రేక్షకుల ముందుకురానుంది.





# మూడేళ్లుగా సింగిల్‌గానే.. రిలేషన్‌షిప్‌పై నోరు విప్పిన శుభ్‌మన్ గిల్

**టీమిండియా స్టార్ ప్లేయర్ శుభ్‌మన్ గిల్ వ్యక్తిగత జీవితం గురుంచి గత కొంతకాలంగా పుకార్లు షికారు చేస్తున్న సంగతి తెలిసిందే. తొలుత భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్‌తో గిల్ ప్రేమాయణం సాగించినట్లు ప్రచారం జరిగింది. మళ్లీ కొంతకాలం తర్వాత వీళ్లిద్దరికి బ్రేకప్ అయిందని వార్తలు వినిపించాయి.**

అయితే ఈ వార్తలపై గిల్ కానీ సారా కానీ ఎప్పుడు స్పందించలేదు. ఆ తర్వాత బాలీవుడ్ బ్యూటీ సారా అలీ ఖాన్‌తో గిల్ డేటింగ్‌లో ఉన్నట్లు సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగింది. కానీ గిల్‌తో తాను డేటింగ్ చేయడం లేదని సారా అలీ ఖాన్ స్పష్టం చేసింది.

వీరిద్దరి తర్వాత మరో బాలీవుడ్ హీరోయిన్ అనన్య పాండేతో గిల్ పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలను అనన్య మాత్రం ఖండించింది. అవన్నీ వట్టి రూమర్సే అని కొట్టిపారేసింది. తాజాగా తన రిలేషన్‌షిప్‌పై వస్తున్న వార్తలపై గిల్ స్పందించాడు. గత మూడేళ్ల నుంచి తాను ఒంటరిగా ఉన్నానని గిల్ చెప్పుకొచ్చాడు.

"నేను ప్రస్తుతం ఎవరితోనూ ప్రేమలో లేను. గత మూడేళ్ల నుంచి నేను ఒంటరిగా ఉన్నాను. ఇటీవల కాలంలో చాలా మందితో నన్ను ముడి పెట్టారు. నా వ్యక్తిగత జీవితంపై చాలా ఊహాగానాలు, పుకార్లు ప్రచారం చేశారు. నేను ఎప్పుడూ చూడని, కలవని వ్యక్తితో కూడా లింకులు పెడుతున్నారు. నిజంగా ఇది చాలా హాస్యాస్పదం.

ప్రస్తుతం నేను నా ప్రొఫెషనల్ కెరీర్‌పై దృష్టి పెట్టాను. ప్రస్తుతం ఒకరితో ప్రేమాయణం నడిపే అంత సమయం నా దగ్గర లేదు. మేము ఎక్కడక్కడికో ప్రయాణిస్తుంటాము. ప్రొఫెషనల్ కెరీర్‌తో బీజీగా ఉన్నాను" అని ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో గిల్ పేర్కొన్నాడు. కాగా ఐపీఎల్ 2025లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరిస్తున్నాడు



# అదరగొట్టిన పంజాబ్ ఓపెనర్లు.. కోల్‌కతా లక్ష్యం 202

**కోల్‌కతాతో మ్యాచ్‌లో పంజాబ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది.**

**ఇంటర్నెట్ డెస్క్** : ఐపీఎల్ 2025లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్లు తలపడుతున్నాయి. ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో.. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (69), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (83)లు అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25*), ఇంగ్లిస్ (11*) పరుగులు చేశారు. మ్యాక్స్‌వెల్ (7), మార్కో యాన్సెన్ (3) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా రెండు, వరుణ్ చక్రవర్తి, రస్సెల్ తలో వికెట్ తీశారు.

# ఈడెన్ గార్డెన్స్‌లో వర్షం.. కోల్‌కతా - పంజాబ్ మ్యాచ్ రద్దు

**వర్షం కారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో జరగాల్సిన కోల్‌కతా నైట్‌రైడర్స్ - పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ రద్దయింది.**

**కోల్‌కతా:** వర్షం కారణంగా ఈడెన్ గార్డెన్స్‌లో జరగాల్సిన కోల్‌కతా నైట్‌రైడర్స్ పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య మ్యాచ్ రద్దయింది. 202 పరుగుల లక్ష్యంతో కోల్‌కతా జట్టు బ్యాటింగ్ ఆరంభించిన కొద్ది సేపటికే వర్షం మొదలైంది. దీంతో మ్యాచ్ రద్దు చేస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. పంజాబ్, కోల్‌కతాకు చెరో పాయింట్ కేటాయించారు. పాయింట్ల పట్టికలో పంజాబ్ (11 పాయింట్లతో) నాలుగో స్థానంలో ఉండగా.. కోల్‌కతా (7 పాయింట్లతో) ఏడో స్థానంలో ఉంది. ప్లే ఆఫ్స్ కోణంలో ఈ పాయింట్ పంజాబ్ జట్టుకు కీలకం కానుంది. ఐపీఎల్ 18 సీజన్‌లో వర్షం కారణంగా రద్దయిన తొలి మ్యాచ్ ఇదే.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 201 పరుగులు చేసింది. ఓపెనర్లు ప్రియాంశ్ ఆర్య (69), ప్రభ్‌సిమ్రన్ సింగ్ (83)లు అర్ధ సెంచరీలతో అదరగొట్టారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (25*), ఇంగ్లిస్ (11*) పరుగులు చేశారు. మ్యాక్స్‌వెల్ (7), మార్కో యాన్సెన్ (3) సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాడు. కోల్‌కతా బౌలర్లలో వైభవ్ అరోరా రెండు, వరుణ్ చక్రవర్తి, రస్సెల్ తలో వికెట్ తీశారు.



# ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనలేదు: సురేశ్ రైనా

**ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి మాత్రం విజయాల కోసం కష్టపడాల్సిన పరిస్థితి ఎదురైంది. తాజాగా చెపాక్ వేదికగా సన్‌రైజర్స్ చేతిలోనూ ఓడిపోయింది.**

**ఇంటర్నెట్ డెస్క్:** ఐపీఎల్ 2025 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు వెళ్లడం దాదాపు కష్టమే. తొమ్మిది మ్యాచుల్లో కేవలం రెండే విజయాలు సాధించిన సీఎస్కే.. మిగిలిన ఐదు గెలిచినా నాకౌట్‌కు వెళ్తుందని చెప్పడం కష్టమే. అయితే, ఇతర జట్ల అవకాశాలను ఎలా ప్రభావితం చేస్తుందనేదే ఇక్కడ ఆసక్తికర అంశం. మెగా వేలం సందర్భంగా సరైన ఆటగాళ్లను ఎంపిక చేసుకోవడంలో సీఎస్కే వెనకబడిందని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా వ్యాఖ్యానించాడు. ధోనీ ఉన్నా.. మిగతా క్రికెటర్లు రాణిస్తేనే విజయం వరిస్తుందని పేర్కొన్నాడు. అయితే, ధోనీ ఎప్పుడూ వేలంలో పాల్గొనేవాడు కాదని గుర్తు చేశాడు.



**ధోనీకి అలా బంతులేస్తే బాదేస్తాడు: హర్షల్ పటేల్**

"కాశీ సర్‌కు అడ్మినిస్ట్రేషన్‌కు 30ఏళ్లకుపైగా అనుభవం ఉంది. రూపా మేడమ్‌కు క్రికెట్ వ్యవహారాలు, ఆటగాళ్లను ఎలా కొనుగోలు చేయాలి, గ్రూప్‌ను ఎలా నిర్వహించాలనే విషయాలపై పట్టు ఉంది. అయితే, ఈసారి మాత్రం సరైన ఎంపికలు చేసినట్లు అనిపించలేదు. ఇది ప్రతిఒక్కరి భావన. ధోనీ ఉన్నా కూడా ఇలా ఎందుకు జరిగిందని కొందరు అడుగుతారు. నిజాయతీగా చెప్పాలంటే.. నేను ఎప్పుడూ వేలం ప్రక్రియకు హాజరుకాలేదు. అలాంటి చర్చల్లో భాగం కాలేదు. నేనెప్పుడైనా సరే రిటైన్ చేసుకున్న ప్లేయర్ల గురించే మాట్లాడేవాడిని. ధోనీ కూడా తన నిర్ణయం ఏంటో చెప్పేవాడు. అంతేకానీ, వేలంలో ఎప్పుడూ భాగం కాలేదు. కోర్ గ్రూప్‌లోని సభ్యులే ఆక్షన్‌లో పాల్గొంటారు. ధోనీ ఇలాంటి వేలానికి హాజరుకాడు. ఓ నలుగైదుగురు పేర్లను మాత్రమే సూచిస్తాడు. ఎవరిని రిటైన్ చేసుకోవాలో చెబుతాడు. 43 ఏళ్ల వయసులో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌గా బరిలోకి దిగిన ధోనీ కష్టపడుతుంటే.. మిగతా పది మంది ఏం చేస్తున్నట్లు? అందులో కొందరికి రూ.18 కోట్లు, రూ.17 కోట్లు, రూ.12 కోట్లు దక్కాయి. మేనేజ్‌మెంట్ నమ్మి అవకాశం ఇచ్చినప్పుడు సద్వినియోగం చేసుకోవాలి. కానీ, ప్రతిసారీ అదే తప్పులతో విఫలం కావడం చూస్తున్నాం" అని రైనా వ్యాఖ్యానించాడు.

**ఇప్పటికీ మాది మంచి జట్టే: ఫ్లెమింగ్**

"ఈ ఓటమిపై మాట్లాడటం కష్టంగా అనిపిస్తోంది. మా దగ్గరున్న అత్యుత్తమ క్రికెటర్లతో సరైన ప్రదర్శన చేసేందుకు ప్రయత్నించాం. మా స్టైల్ క్రికెట్ ఆడాం. ఆక్షన్‌లో మంచి జట్టును తయారుచేసుకోవడం కీలకం. ఈ విషయంలో మాకంటే ఇతర టీమ్‌లు కాస్త మెరుగ్గా ఉన్నాయి. టాప్ ఆర్డర్ నుంచి కింది వరుస వరకూ ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. కీలక ఆటగాళ్లకు గాయాలు, కొందరు ఫామ్‌లో లేకపోవడం కూడా ప్రభావం చూపించింది" అని సీఎస్కే కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెల్లడించాడు.

**ఇక ట్రయల్ రన్‌లా..: రాయుడు**

"ప్రస్తుత సీజన్‌లో సీఎస్కే పరిస్థితి బాగోలేదు. అథమంలో అథమంగా మారింది. అయితే, ఇక నుంచి నేర్చుకొనేందుకు చక్కటి అవకాశం వచ్చినట్లే. ఎంఎస్ ధోనీ కూడా వచ్చే ఎడిషన్ కోసం జట్టును తయారుచేసే పనిలో పడతాడు. ఇప్పుడు డెవాల్డ్ బ్రెవిస్, ఆయుష్ మాత్రే వంటి కుర్రాళ్లు వెలుగులోకి వచ్చారు. భవిష్యత్తు సీజన్లలో వారే కీలకంగా మారే అవకాశం లేకపోలేదు. వ్యక్తిత్వపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఇప్పుడంతా ట్రయల్‌రన్‌లా సీఎస్కే జట్టును చూడొచ్చు" అని అంబటిరాయుడు వ్యాఖ్యానించాడు.

# వారికంటే ఐపీఎల్‌లో

## అన్‌క్యాప్‌డ్ ప్లేయర్ భత్యమే ఎక్కువ: సునీల్ గావస్కర్

**ప్రస్తుత తరం క్రికెటర్లు జాతీయ జట్టులోకి రావాలంటే దేశవాళీలో కంటే ఐపీఎల్‌లో రాణించాల్సిన అవసరం ఉంది. అయితే, మెగా లీగ్‌లోకి అడుగుపెట్టాలంటే దేశవాళీ ప్రదర్శన కీలకమనే విషయాన్ని మరువకూడదు.**

ఇంటర్నెట్ డెస్క్: భారత జట్టుకు ఎంపిక కావాలంటే ఇప్పుడు సులువైన మార్గం ఐపీఎల్ . ఒకప్పుడు దేశవాళీ క్రికెట్‌లో మంచి ఆటతీరు కనబరిస్తే ఠక్కున అవకాశాలు వచ్చేవి. ఇప్పుడైతే ఐపీఎల్‌లో నిలకడగా ఆడుతున్నాడా? లేదా? అనేది మేనేజ్‌మెంట్ చూస్తుందనడంలో సందేహం లేదు. అలాగని రంజీల్లో ఆడేవారికి విలువ లేదా? అంటే ఉంది కానీ ఐపీఎల్‌తో పోలిస్తే అవకాశాలపరంగానే కాకుండా జీతభత్యాల్లోనూ వ్యత్యాసం ఉందనేది మాజీ క్రికెటర్ల అభిప్రాయం. ఈ అంశంపై క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ తన విశ్లేషణను వెల్లడించాడు.

**పాక్‌తో క్రికెట్ సంబంధాలన్నింటినీ తెంచుకోవాలి: సౌరభ్ గంగూలీ**



"పెద్దగా పరిచయం లేని క్రికెటర్ కూడా ఐపీఎల్‌లో ఒక్క మంచి ఇన్నింగ్స్ ఆడినా చాలు గొప్ప గౌరవం అందుకొంటాడు. అదే జాతీయ ఛాంపియన్‌షిప్ రంజీ ట్రోఫీలో ఎంత రాణించినా కనీసం హెడ్‌లైన్స్‌లోనూ కనిపించడు. ఐపీఎల్‌లో అలా కాదు. ఇప్పటికే ఎన్నో సందర్భాలను మనం చూశాం. సీజన్‌లో ఒకటి లేదా రెండు మ్యాచుల్లో దూకుడుగా ఆడితే అతడి పేరు మారుమోగిపోతుంది. కెరీర్ మొత్తం రంజీ ట్రోఫీ ఆడినా అది సాధ్యం కాదు. ఐపీఎల్‌కున్న భారీ ఆదరణే దీనికి కారణం. బ్రాడ్‌కాస్ట్‌పరంగానూ స్పాన్సర్‌షిప్ హక్కులు రూ.కోట్లలో ఉంటాయి. ఐపీఎల్ కంటే ఎక్కువగా దేశవాళీలో ఆడే వారికి ఇది పెద్దగా రుచించని వాస్తవం. రంజీ ట్రోఫీ, విజయ్ హజారే, సయ్యద్ ముస్తాక్ అలీ సీజన్‌లు అన్నీ కలిపి ఆడినా.. ఐపీఎల్‌లో అన్‌క్యాప్‌డ్ ప్లేయర్‌కు వచ్చే కనీస మొత్తం రూ.30 లక్షలకు దరిదాపుల్లో ఉండదు. ఈ అసమానతను తగ్గించాల్సిన అవసరం బీసీసీఐతోపాటు అన్ని రాష్ట్రాల క్రికెట్ బోర్డులపై ఉంది. ఇప్పటికే ముంబయి తమ రంజీ ప్లేయర్లకు బీసీసీఐతో సమానంగా చెల్లింపులు చేస్తోంది" అని గావస్కర్ వెల్లడించాడు.

**ప్రస్తుతం స్టార్లుగా మారిన బుమ్రా, హార్దిక్, సిరాజ్, యశస్వి, కేఎల్ రాహుల్, చాహల్.. ఇలా చాలామంది జాతీయజట్టుకు ఎంపికైనవారే. తాజాగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ రాజస్థాన్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ రూ.1.1 కోట్ల ప్యాకేజీని సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే.**